## కథ

# ప్రేమలేఖ

సంగిపాగి ఆనందరాజు

"ఎవర్రాశారబ్బా" నాకీ లేఖని ఆశ్చర్య పోతున్నావు కదూ! చదువు నీకే అర్ధమవుతుంది.

అతి త్వరలో నా దానివి కాబోయే నీకు! ఈ నా సంభోదన చదవగానే నీకు నాపై బోలెడంత కోపం వస్తుందని నాకు తెలుసులే.

ఏంటీ నీ మనసులో ఈ కలవరపాటేంటిది? నునులేత బెండకాయల్లాంటి అతి సుకుమారమైన నీ చేతివేళ్ళెందుకలా చిగురుటాకుల్లా వణుకుతున్నాయి.

'నా దానివి కాబోయే నీకు' అని ఈ ప్రేమలేఖ రాసిన సాహసగాడెవడని భయము, ఆశ్చర్యము, ఆనందము కలగలిసిన ఫలితమే కదా ఈ తత్తరపాటు. అయినా నీకు రాయబారాలు, ప్రేమలేఖలు, ప్రేమ సందేశాలు పంపే సాహసం ఎవరికుంటుందే నాకు తప్ప.

ప్రేమ, దోమ, గీమ వగైరా ఏ ప్రకంపనాలు లేని నీ నిశ్చల మానస సరోవరములోనికి ఎవరూ లేని నీ హృదయాంతరాళంలోకి చొచ్చుకొని పోయి, వేవేల ప్రేమ తరంగాలను రేపి నీ దోర వలపును దోచుకునే నేపథ్యంలో అహర్నిశలు విఫలయత్నాలతో పరిశ్రమిస్తున్న నీప్రేమ పిపాసినైన నేనే, నీ అవినాష్‌నే ఈ ప్రేమలేఖ రాస్తున్నాను.

అదిగో ఆ చిరు కోపమే వద్దంటాను. ఆ కోపాన్ని కాస్త తాపంగా మార్చుకొని చూడు. జీవితమద్భుతానందానుభూతుల సమ్మేళనమని నీకే అర్ధమవుతుంది.

సరిగా ఈ పాయింట్ దగ్గరే నీకు నాకు చుక్కెదురు. జీవితం జీవించడాకని నీవంటావు. జీవితం అనుభవించడానికని నేనంటాను. ఈ విషయం మీద నీవో అవగాహనకొస్తే నీ, నా అద్భుత మధురానుభూతుల జీవితాల్ని చెరిసగం పంచుకుందామని నేను ఆశపడడంలో తప్పేం లేదులే. ఈ విషయంలో నీవు నాకు సహకరించడంలో కూడా తప్పేంలేదులే. అవును మరి ఉప్పుకారాలు తినే ఈ దేహానికి ఆ మాత్రం తాపాలు, పరితాపాలు లేకుంటే వృధాయే సుమా!

నేనేదో నీతో దాచిపెట్టి, నిన్ను మభ్యపెట్టి నిన్ను వంచించడం లేదు. నాకు చేతకాని పనుల్లో మోసం చేయకపోవడం ఒకటి.

గ్రీకు వీరునిలాగా పెళ్ళికాని రాకుమారుడిలాగా నిత్యం నూతనోత్సాహముతో నవ్వుతూ, నవ్విస్తూ కళకళలాడుతుండే నన్ను చూసి, నాకు పెళ్ళయిందనిగాని, నాకో పెళ్ళాం వుందనిగాని, ఆ పెళ్ళాం నాకో ఇద్దరు సుపుత్రుల్ని ప్రసాదించిందని గాని ఎవ్వరూ అనుకోరు. అలా అనుకోరని నేనేనాడు దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. చేయను కూడా. అబద్దాలాడడం కూడా నాకు చేత కావడం లేదు. మన తొలి పరిచయంలోనే మా ఆవిడ మీద జోకులు వేసి నీకు నేను కొన్ని నవ్వుల పువుల్ని కానుకగా సమర్పించుకున్న సంగతి మర్చిపోకే.

శశీ! నీకీ విషయాలన్ని ఎందుకు చెబుతున్నానంటే నీవు రోజు ఇష్టంగా నీ సిగలోకి తురుముకొనే తెల్లని మల్లెవంటిదే నా మనస్సని నీవు గ్రహించడానికి

శశీ నీ కింకో విషయం చెప్పనా? శశీ అంటే పరిచయమయినప్పట్నుంచి నాన్న టీషర్టులు, జీన్సు ప్యాంట్లు వేసుకొని తెగ మురిసిపోతాడని మా సుపుత్రులిద్దరూ వాళ్ళమ్మ దగ్గర జోకులు పేల్చేస్తుంటారు.

మా ఆవిడ కూడా చాలా జోవియల్‌గా వుంటుంది. ఆఫ్‌కోర్స్ అప్పుడప్పుడు అలకపాన్పు ఎక్కుతుందనుకోండి. అలా అలక పాన్పు ఎక్కడం వెనుకదాగివున్న రస మాధుర్యపు రహస్యమేమిటో ఆవిడకు, నాకే తెలుసు. ఆఫ్‌కోర్స్ ముందు ముందు నీకు కూడా తెలుస్తుందిలే. శశీ! నీ అందచందాల మీద ఒట్టు. వున్నట్టుండి అలుకలన్ని ఇట్టే మాయమవుతాయి. చిటికేసి మంత్రమేసినట్లు ఆహ్లాదకరమైన మధుర రస మాధుర్యపు వాతావరణానికి నాంది పలుకుతుంది. మానసికంగా శారీరకంగా అలా అలా గాలిలో విహరించి స్వర్గపుటంచుల్ని స్పృశిస్తాము. ఏమిటి డౌటా? కావాలంటే ప్రాక్టికల్స్ మొదలెట్టుదాం. నీవు కూడా ఎంత కాలమని ఇలా ఒంటరిగా వుంటావు. ఏదో ఒక కోణం దగ్గర జీవితంలో రాజీ పడక తప్పదు సుమా!

శశీ! నాకు తెలియక అడుగుతాను ఇలా ఎంతకాలమని ఒంటరి జీవితాన్ని జీవిస్తావు? ఇలా

ఎంతకాలమని కోర్కెలతో తపించే దేహాన్ని, మనసును బుజ్జగిస్తావు? అసలు నీకు జీవితమంటే ఏమిటో తెలుసా?

జీవితమంటే జంటని ప్రస్తుతం మన మధ్యనున్న సమయా సందర్భాన్ని బట్టి నిర్వచిస్తాను. ఆఫ్‌కోర్స్ ఈ నా డెఫినిషన్‌తో ఎవ్వరూ అంగీకరించరు. ఎందుకంటే సృష్టిలో జీవులన్నీ జంటగానే జీవిస్తాయి. ఇది చాలా సాధారణమైన విషయం. అందుకనే నా నిర్వచనాన్ని ఎవ్వరూ అంగీకరించకపోవచ్చు.

నా దృష్టిలో జీవులు జంటలుగా ఏర్పడడ మనేది ఎంత సాధారణ విషయమో అంత విచిత్రమైన విషయం కూడా. ఎందుకంటే జీవితంలో ఎంతో మంది తారసపడుతుంటారు. కాని మనసనేది ఎవరో ఒకర్ని చూచినప్పుడు మాత్రమే స్పందిస్తుంది. నీ తొలి దర్శన భాగ్యం కూడా అలాంటి స్పందననే నాలో కలిగించింది. ఒక వింతైన అనుభూతిని కలిగించింది. నాకు తెలియకుండానే నా మనసు నీ వశమయినది.

స్త్రీ, పురుషుల మధ్య జంట జీవితాలు లేకపోతే పునరుత్పత్తికి అవకాశముండేదే కాదు. నీవు ఒంటరి జీవితాన్ని జీవిస్తూ సృష్టి ధర్మానికి విఘాతం కలిగించ వద్దు.

ఈ ప్రేమలేఖను ఎక్కడో ప్రారంభించి ఎక్కడికెక్కడికో తీసుకుపోయాను కదూ! సారీ చెప్పాలని వుందిరా. అయినా ప్రేమలో సారీలు పనికిరావు. సరే అసలు విషయానికి వద్దాం. ఇప్పుడు నీకు రమారమి ముప్పై అయిదేళ్ళు పైబడే వుంటాయి. ఇంత సుదీర్ఘమైన జీవితంలో రసభరిత పర్వాలు లేవు నైరాశ్యపు ఛాయలు తప్ప. మధురమైన రాత్రులు లేవు నిదురరాని రాత్రులు తప్ప. సరసపు సన్నివేశాలు లేవు. శృంగార ఘట్టాలు లేవు. రసానుభూతి సంఘటనలు లేవు. మర్చిపోలేని మధురానుభూతుల మైలురాళ్ళు లేవు. బతుకు నిస్సారంగా వుంటే జీవితానికి సార్థకత వుండదు ప్రియా!

ఎప్పుడైనా గట్టిగా అడిగితే ఏదైనా మంచి సంబంధం కుదిరితే చేసుకుంటానంటావు. ఎప్పుడే నీకు మంచి సంబంధం కుదిరేది? వృద్ధాప్యపు ఛాయలు దేహాన్ని ఆవరించిన తర్వాతనా?

మంచి సంబంధం అంటే నీ దృష్టిలో ఏమిటే అనడిగితే మంచి పొజిషన్‌లో వుండేవాడంటావు. మంచి పొజిషనంటే ఆర్థిక స్థోమతనే కదా అందరు అర్థం చేసుకునేది, అందరూ అనుకునేది. దేశంలో ఆర్థికస్థోమత కలిగిన వారికేమీ కొదువ లేదు. మరి అలాంటప్పుడు నీకెందుకు సంబంధం వచ్చి చావదంటే నా ఫ్యామిలి బ్యాక్‌గ్రౌండ్ అంటావు.

బల్లి గోడను అంటిపెట్టుకున్నట్లు మంచానికి అంటిపెట్టుకున్న ముసలి తల్లిదండ్రులు, పక్షవాతంతో కాళ్ళు చేతులు చచ్చుబడిపోయిన చిన్నాన్న. పోలియోతో అవిటిదైన చెల్లెలు. మా ఫ్యామిలీకంతా నేను పెద్దదిక్కుని. జీవితాంతం వారి బరువు బాధ్యతలు నేనే భరించాలి" ఈ షరతుతోనే సంబంధాలన్ని బెడిసి కొట్టుతాయంటావు.

ప్రియా! ఉద్యోగం సద్యోగంతో పాటు మంచి ఆర్థికస్థోమత కలిగిన వానికోసం నిరీక్షించడం కంటే నిన్ను, నీ ఫ్యామిలి బ్యాక్‌గ్రౌండ్‌ని అర్థం చేసుకోగలిగే మంచి గుణగణాలున్న వ్యక్తి కోసం అన్వేషిస్తే నీ వరుడుగా నవమన్మథుడిగా నీ కళ్ళెదుటే నేను ప్రత్యక్షం కాలేనా?

వెధవ బరితెగించాడని అనుకుంటున్నావు కదూ! నేనలాంటి వ్యక్తిని కాదులే శశీ! ఇలాంటి ప్రేమలేఖలు రాసే వ్యక్తుల పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి రాశాను. ఇలాంటి మనస్తత్వం గల మగమహరాజులు సమాజంలో ఎందరో వుంటారు. నీపై ఆ దుష్టుల చూపు పడకూడదని నా అభిప్రాయం. ఈ నా లేఖ చూసైనా సరే మొన్న వచ్చిన సంబంధానికి పచ్చజెండా వూపేయ్.

శశీ! నీవో ఇల్లాలివైతే నాకంటే సంతోషించే వ్యక్తి మరెవ్వరూ వుండరు.

## 'మేము ముగ్గురం'

### రేణుక అయోలా

నేను మెత్తటి పాత చీర ముక్కను
ఆమె మెడలో జోలెను.

రణగొణ ధ్వనుల మధ్య పరుగులు పెడుతూ
కార్లు, లారీల లైట్ల సూది చూపుల మధ్య మేము
ముగ్గురం.

ఆ పసివాడిని పొదువుకుని
వాడి చిన్ని గుండె శబ్దం వింటూ, మోస్తూ నేను
అమ్మ ముఖంలోకి చూస్తూ, ఏడుస్తూ,
నవ్వుతున్నవాడు.
వాడిని పట్టించుకునే తీరికలేక
చేతులు చాస్తూ అందరి ముఖాల్లోకి ఆశగాచూస్తూ
అడుక్కునే తల్లి
వాడికి వేవి అర్థం కావు
అర్థాలు వెదికే నేను మాత్రం
మెత్తని పొత్తిలిలా దగ్గరవుతాను
లేత నంది వర్ధనపు పూరేకుల కళ్ళు
నీటి ఊటలవడం నాకు తెలుసు

ఆకలితో కునుకులు తీస్తూ
అమ్మ కోసం ఎదురు చూడటం నాకు తెలుసు
ఆ ఇద్దరి మధ్య వారధిలా నేను
పసివాడి ఆటస్థలంలా ఊయలలా అన్నీనేనై
పగలంతా అంటిపెట్టుకుని వుంటాను.
మాటలు రాని నూలుపోగుల జోలెను
వాడు ఏడుస్తాడు, అమ్మ ముఖం కోసం
బెంగపెట్టుకుంటాడు.
కసురు కుంటుంది. లాలిస్తుంది, సముదాయిస్తుంది.
ఒక్కక్షణం
అమ్మ పాత్రలోకి వచ్చేద్దామను కుంటుంది
ఆకలి అడ్డుతగులుతుంది.
నేను ఓదార్చాలనుకుంటాను
ఇంకా ఇంకా మెత్తగా మారిపోవాలనుకుంటాను.
వాడికి కావలసింది నేనుకాదు
అమ్మ, అమ్మ వెచ్చటి ఎద.
నిశి ఎప్పటిలాగే నిదానంగా వచ్చేసింది.
వీధిదీపాలు వెర్రిగా ఎర్రగా రోడ్లమీద పరచుకున్నాయి.
అసిపోయిన రోడ్లు
అలసిపోని ప్రయాణాలు

++++

లేత కనులు మూతబడితే
నిద్ర ఆకలిని బుజ్జగించి ఒడి చేర్చుకుంది.
నేను దుప్పటిముక్క పాత్రలోకి మారిపోయాను.
వేడినేల మీద పరచబడ్డాను
ఆనందంలో వెర్రి సంతోషంతో
అమ్మ పక్కలో ఎదను తడుముకునే వాడికోసం
మెత్తటి వెల్వెట్ తివాచీ నవ్వుదామనుకుంటూ కలలు కంటాను
ఆమాత్రపు అమ్మ కౌగిలితో, ఒడిలో ఒదిగిపోతాడు
చుక్కల దుప్పటి కింద నిద్రపోతాడు.